# సత్యవాక్కు

# The Word of Truth

# మీ కొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక **10** | మే **1984** | సంపుటి **4**


# సంపాదకీయము

## కొద్ది మాటలతోనే

***( With Just a Few Words )***

లేఖనములు చదువుచున్నప్పుడు యేసుప్రభువు యేమి చెప్పాలనుకొన్నాడో దానిని కొద్ది మాటలతోనే చెప్పగలిగినట్లు నీ వెన్నడైనా గమనించావా? దేనినైనా వివరించడానికి ఆయన పెక్కు పదాలను వినియోగించ నవసరం లేకపోయేది. చెప్పాలనుకున్న దానిని ఆయన బాగా యెరిగి యుండేవాడు. దాన్ని సూక్ష్మంగా చెప్పేవాడు, అంతే.

దీనికి తారతమ్యంగా, మానవులైతే యేసు చెప్పినదాన్ని గూర్చి, లేక ఆత్మావేశ లేఖకులు చెప్పిన దాన్ని గూర్చి తెలియ జేయడానికి పెద్ద పెద్ద గ్రంథాలు వ్రాస్తారు. ఒక్కోసారి వారు వాక్య భాగాన్ని తీసికొని దానిలో లేనిది ఉన్నట్లు తెలియ జేయడానికి ప్రయత్నిస్తారు. వారు చెప్పేదాన్ని బలపరచడానికి ఇతరుల మాటలను వల్లిస్తారు. చివరకు వారు దేనితో మొదలు పెట్టారో దానికి వ్యతిరేకమైన దాన్ని

చెబుతారు. ఒక్కోసారి వారేమి చెబుతున్నారో చదువరులకే అర్థం కానిరీతిగా చెబుతారు. అటువంటప్పుడు దాన్ని అక్కడ అవుజేసి దేవుని వాక్యం దగ్గరకు వెళ్లాలి. మనం ఏమి వినాలని ప్రభువు కోరు చున్నాడో దాన్ని ప్రభువునుండే వినాలి. మనం ప్రభువు చెప్పిన దాన్ని అంగీకరించి దాని ప్రకారం చేసినప్పుడే సరియైన మార్గంలో యుండగలంగాని అంతకు ముందుకాదు.

ఈ అంశాన్ని విపులీకరించుటకుగాను, మనం లేఖనముల యొద్దకు వెళ్లి ఆయా అంశాలపై అవేమి చెప్పుచున్నవో గమనించుదాం:

1. రక్షణను గూర్చి క్రీస్తు ఇట్లు చెప్పాడు: "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16). అయితే మానవుడొచ్చి ప్రభువు చెప్పింది అది కాదంటాడు. మానవుల సిద్ధాంతముల ప్రకారము రక్షింప బడాలంటే ఒకడు విశ్వాసముంచాలి. తరువాత అతడు రక్షింపబడినట్లు కనుబరచ డానికి బాప్తిస్మం పొందాలని ప్రభువు చెప్పాడంటాడు. అయితే మానవుడేమి చెప్పాడనునది ప్రశ్న కాదుగాని క్రీస్తు యేమి చెప్పాడు? మనం రక్షింపబడాలంటే క్రీస్తు యేమి చెప్పాడో అది వివరంగా లేదా?

2. ఒకని హృదయంలో విశ్వాసం కలిగే విధానాన్ని గూర్చి పౌలు ఇట్లు వ్రాసాడు: "కాగా వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). దేవుని వాక్యమునకు మించి చూచిన దాన్ని బట్టి విన్నదాన్ని బట్టి విశ్వాసం కలుగునని మానవులు బోధిస్తారు. అయితే లేఖనములు ఈ మానవకల్పిత సిద్ధాంతముతో ఏకీభవించుట లేదు.

3. బాప్తిస్మము ఒక సమాధి యని నిర్వచించ బడింది. పౌలు ఇట్లనుచున్నాడు: "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్ట బడినవారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావ మందు విశ్వసించుటద్వారా ఆయనతోకూడ లేచితిరి" (కొలస్స 2:12).

మానవుడైతే బాప్తిస్మమంటే చిలకరింపుగాని, కుమ్మరింపుగాని, లేక సమాధిగాని యని నిర్వచిస్తున్నాడు. ఏ నిర్వచనాన్ని నీ వంగీకరిస్తావు?

4. ఒకడు సంఘసభ్యు డెట్లగుతాడో యనుదాన్ని గూర్చి వివరింపబడినప్పుడు లేఖనాల్లో, "ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" అని చదువగలం (అపో. కా. 2:47) సంఘంలో చేరడాన్ని గూర్చి మానవుడు చెబుతాడు. చేరడమా లేక చేర్చబడడమా? లేఖనాల ప్రకారం ఏదిరైటు?

5. విభజనను సూచించుచున్న అన్ని సంఘాలకొరకు మానవుడు దేవునికి కృతజ్ఞత చెల్లిస్తాడు గాని క్రీస్తు ఏకత్వంకొరకు ప్రార్థించాడు. ఆయన చేసిన ప్రార్థన నాలకించుము: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాస ముంచువారందరు ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21). ఐక్యతను గూర్చి యున్న ఈ మాటలను అర్థం చేసికొనడం కష్టమా?

6. మానవులు సంఘానికి శిరస్సుగా యుండుట సాధ్యమే యని మానవులు మనకు చెబుతారు, అయితే క్రీస్తే సంఘానికి శిరస్సని పౌలు చెబుతున్నాడు. "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23). వీరిలో ఎవరు రైటను కొనుచున్నావు?

7. నేటి లోకంలో పురుష సంయోగులు మొదలైనవారు బహిరంగముగా వారు చేయుదాన్ని ప్రకటించుచున్నారు. వారి ప్రవర్తనను స్వతిరేకించువారు సంకుచిత స్వభావులని, తోటి మానవుల యెడల

వివక్షత జూపువారని చెప్పడం జరుగుచున్నది. అయితే ఈ అంశాన్ని గూర్చి లేఖనాలుకూడ కొంత చెప్పుచున్నవి. దాన్ని మనం వినడం మంచిది. దైవావేశ లేఖకుడు ఇట్లు వ్రాశాడు: "అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి, జారులైనను విగ్రహారాధకులైనను వ్యభిచారులైనను ఆడంగితనము గలవారైనను పురుషసంయోగులైనను దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరింథీ 6:9, 10). మన కిష్టమైనా లేకపోయినా ఈ పాపములు దేవునిచే ఖండించ బడినవి. వాటిని గూర్చి మారుమనస్సు పొందనొల్లనివారు రక్షింపబడలేరు, పరలోకానికి వెళ్ళలేరు.

8. నేడు ప్రపంచంలో భార్యాభర్తలు విడాకులు యిచ్చుకోవడం తిరిగి పెండ్లాడడం జరుగుచున్నది. ఇటువంటిదానిలో ఇరుక్కున్నవారిలో పెక్కుమంది వ్యభిచార జీవితాన్ని గడుపుచున్నారు. అలాగని అంగీకరించడానికి బదులు యేసుప్రభువు, ఆత్మావేశ లేఖకులు ఈ అంశముపై చెప్పిన దానిని వివరించడానికి చాలమంది పూనుకొనుచున్నారు. అయితే యేసు చెప్పిన ఈ సూక్ష్మమైన మాటల నాలకించుడి: "మరియు వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లి చేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు మీతో చెప్పు చున్నాను" (మత్త 19:9). మానవుడు దీనిని నిరాకరించవచ్చును, దానినేదో వివరించ బూనుకొనును లేదా తన యిష్టం వచ్చినట్లు ప్రవర్తించును. అయితే అంతా చెప్పి చేసిన తరువాతికూడా దేవుని వాక్యం చెప్పేది ఒకటే. దానిలో మార్పుండదు.

ఇటువంటి సంగతుల నెన్నిటినో మనం చెప్పుకో వచ్చును.

వాస్తవం యేమంటే యేసును మిగిలిన దైవప్రేరిత లేఖకు లందరును సత్యాన్ని పలికారు. వారొకమారు పలికితే అదేచాలు. వారు చెప్పిన దాంట్లో స్వయం విరుద్ధ సంగతు లేమీలేవు. దాన్ని మనం అంగీకరిస్తాము లేదా నిరాకరిస్తాము. దాన్ని మార్చి ఏదేదో వివరణలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే మన మీదికి శిక్ష వస్తాది. మన బోధనాల ించిన వారికి కూడా శిక్ష కలుగుతాది.

సత్యం తెలిసికొనడానికి నీవు లేఖనముల యొద్దకు వెళ్లాలని కోరుచున్నాను. దాన్ని చదివి ధ్యానించుము. అది చెప్పేదాన్ని అంగీకరించుము. లేఖనాలు చెప్పేది నీ భావాలతోగాని నీ బోధతోగాని సమన్వయించకపోతే లేఖనాలను కాదుగాని నీ భావాలను బోధను మార్చుకో. నీ ఆలోచనలు లేఖనాలతో సమన్వయించే లాగుండాలి. నీ జీవితం ఆయన చెప్పేదానితో సరితూగాలి. అప్పుడు మాత్రమే నీవు సరిగా యుంటావు. ఎందువలనంటే దేవుని వాక్యం ఎల్లప్పుడు సరిగానే యుంటాది.

---

## పస్కా గొర్రెపిల్ల
## *( The Passover Lamb )*

ఆదికాండ గ్రంథము ఇశ్రాయేలీయులు ఐగుప్తులో యుండుటతోను, యోసేపు మరణంతోను అంతమగుచున్నది. దేవుని ప్రజలు ఐగుప్తులో ఇంకా నివసించుటతో నిర్గమ కాండము ఆరంభమగుచున్నది. "ఇశ్రాయేలీయులు బహు సంతానము గలవారై అభివృద్ధి పొంది విస్తరించి అత్యధికముగా ప్రబలిరి; వారున్న ప్రదేశము వారితో నిండియుండెను" (నిర్గమ 1:7). అయితే త్వరలో వారికి సమస్య లెదురైనవి. "అప్పుడు యోసేపును ఎరుగని క్రొత్తరాజు ఐగుప్తును ఏల నారంభించెను" (నిర్గ 1:8). ఈ క్రొత్త రాజుల కాలంలో "ఇశ్రాయేలీయులచేత ఐగుప్తీయులు కఠినముగా సేవ చేయించుకొనిరి.

వారు ఇశ్రాయేలీయులచేత చేయించుకొనిన ప్రతి పనియు కఠినముగా ఉండెను. వారు జిగటమంటి పనిలోను, ఇటుకల పనిలోను పొలములో చేయు ప్రతి పనిలోను కఠినసేవ చేయించి వారి ప్రాణములను విసికించిరి" (నిర్గ 1:13, 14). "ఆలాగున అనేక దినములు జరిగినమీదట ఐగుప్తురాజు చనిపోయెను. ఇశ్రాయేలీయులు తాము చేయుచున్న వెట్టిపనులను బట్టి నిట్టూర్పులు విడుచుచు మొరపెట్టుచుండగా తమ వెట్టిపనులనుబట్టి వారు పెట్టిన మొర దేవునియొద్దకు చేరెను. కాగా దేవుడు వారి మొరను విని, అబ్రాహాము ఇస్సాకు యాకోబులతో తాను చేసిన నిబంధనను జ్ఞాపకము చేసికొనెను. దేవుడు ఇశ్రాయేలీయులను చూచెను; దేవుడు వారియందు లక్ష్యముంచెను" (నిర్గ 2:23-25).

అప్పుడు దేవుడు ఐగుప్తు బానిసత్వమునుండి తన ప్రజలను విడిపించుటకు మోషేను లేవనెత్తెను. తన ప్రజలను పోనియ్యమని అడుగుచు మోషే ఫరోయొద్దకు పలుమారులు వెళ్ళెను. ప్రతిసారి ఫరో నిరాకరించుటయే గాక తన హృదయాన్ని కఠినపరచుకొనెను. గనుక ఆ దేశాన్ని ప్రభువు పది ఘోరమైన తెగుళ్ళతో మొత్తెను. చివరిగా తొలిచూలు పిల్లల చావువలన హెబ్రీయులను విడిచిపెట్టి యెహోవా దేవుని శాంతింపజేయుట ఉత్తమమని ఫరో తలంచాడు.

అయితే ఐగుప్తీయుల తొలిచూలు బిడ్డలను హతమార్చిన మరణదూత యూదుల పిల్లలపైకి రాలేదు. ఎందువలనంటే వారు రక్షింపబడే విధానాన్ని దేవుడు వారికి ముందుగనే చెప్పాడు. ఈ విధానం పస్కా గొర్రెపిల్లలో కనబడుచున్నది.

దేవుని ఆత్మీయ ఇశ్రాయేలుమైన మనము ఒక గొప్ప రోగమునుండి అనగా పాపము, మరణమనే రోగమునుండి విడుదల పొంద ప్రయత్నించుచున్నాము (రోమా 3:23; 6:23). మన విమోచన కూడ పస్కా గొర్రెపిల్లలో యున్నది. ఆ గొర్రెపిల్ల క్రీస్తని పౌలు

చెప్పుచున్నాడు. "మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతేగాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను" (1 కొరింథీ 5:7).

ఇశ్రాయేలీయులవలె మనకుకూడా పస్కా గొర్రెపిల్ల యున్నది. ఈ రెండింటిలోను కొన్ని సమానాంతరాలను మనం చూడవచ్చును. ఇశ్రాయేలీయులు వధించిన పస్కా గొర్రెపిల్లకు, మనకొరకు వధింపబడిన యేసుక్రీస్తుకు కనీసం నాలుగు సమానాంతరాలను మనం చూడగలము.

1. ఈ రెండు గొర్రెపిల్లలు పవిత్రమైనవి : దేవుడు ఇశ్రాయేలీయులతో ఇట్లు చెప్పాడు. "నిర్దోషమైన యేడాది మగపిల్లను తీసికొనవలెను. గొర్రెలలో నుండి యైనను మేకలలో నుండి యైనను దానిని తీసికొన వచ్చును" (నిర్గమ 12:6). యేసుప్రభువుకూడ పవిత్రమైనవాడు. ఆయనలో ఏ పాపములేదు. "మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను" (హెబ్రీ 4:15).

2. ఈ గొర్రెపిల్లల ఎముకలు విరుగగొట్ట కూడదు : పస్కా గొర్రెపిల్లనుగూర్చి మనం ఇట్లు చదువగలము : "మీరు ఒక్క యింటిలోనే దానిని తినవలెను. దాని మాంసములో కొంచెమైనను ఇంటిలోనుండి బయటికి తీసికొని పోకూడదు, దానిలో ఒక్క యెముకయైనను మీరు విరువకూడదు" (నిర్గ 12:46). దీనితో పోల్చి చూస్తూ యోహాను 19వ అధ్యాయంలో, సిలువవేయబడిన వారికాళ్లు విరుగగొట్టడానికి సైనికులు వచ్చిరి. "వారు యేసునొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతి పొందియుండుట చూచి ఆయన కాళ్లు విరుగగొట్టలేదు". "అతని యెముకలలో ఒకటైనను విరుగబడదు అను లేఖనము నెరవేరునట్లు ఇవి జరిగెను" (యోహాను 19:33, 36).

3. పులిపిండి లేకుండా ఈ పస్కాను భుజింపవలెను : హెబ్రీయుల పస్కాను గూర్చి మన కీలాగున చెప్పబడింది: "ఆ రాత్రియే వారు అగ్నిచేత కాల్చబడిన మాంసమును పొంగని రొట్టెలను తినవలెను. చేదుకూరలతో దానిని తినవలెను. క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెనని చెబుతూ అపొ. పౌలు ఇట్లనుచున్నాడు: "గనుక పాతదైన పులిపిండితోనైనను, దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ, నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము" (1 కొరింథీ 5:8).

4 ఈ రెండు పస్కాలలోను రక్తమువలన రక్షణ కలిగింది: నిర్గమ 12:13 లో మనం ఇట్లు చదువగలం: "మీరున్న యిండ్లమీద ఆ రక్తము మీకు గురుతుగా ఉండును. నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపచేయక దాటి పోయెదను. నేను ఐగుప్తు దేశమును పాడు చేయు చుండగా మిమ్మును సంహరించుటకు తెగులు మీ మీదికి రాదు". ప్రభు రాత్రిభోజనము నిస్తూ యేసుప్రభువు, "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పాడు (మత్తయి 26:28). "ఇదిగో లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" యని యేసునుగూర్చి యోహాను చెప్పిన దానిని గ్రహించుకొనుటకు యిది మనకు సహాయం చేయును (యోహాను 1:29).

నిజంగా క్రీస్తు మన పస్కా గొఱ్ఱెపిల్లయే. అయితే ఆయన రక్తమునందలి ఆశీర్వాదములను పొందాలంటే ఇశ్రాయేలీయులవలె మనంకూడా కొంత చేయాలి. వారు పస్కా పశువు యొక్క రక్తాన్ని తమ ద్వార బంధములకు తాకింప చేయుటవలన రక్షింప బడ్డారు. ఆ యాజ్ఞకు లోబడకపోతే ఐగుప్తీయుల తొలిచూలు పిల్లలవలె ఇశ్రాయేలీయుల పిల్లలుకూడ నశించి యుందురు. పాపరోగము నుండి మనం తప్పింప బడాలంటే మన కాజ్ఞాపింప బడినవాటిని చేయాలి.

క్రీస్తుకు వెలుపల యున్నవారు జీవమిచ్చు ఆయన రక్తము దరికి చేరాలి. అది బాప్తిస్మములో జరుగుచున్నదని పౌలు చెప్పుచున్నాడు (రోమా 6:3, 4). క్రైస్తవులైనవారు ఆయన వాక్యపు వెలుగులో నిరంతరము నడవాలి. అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7).

—విక్టర్, M. E.

---

# విగ్రహారాధన

## (*Idolatry*)

"ఆదియందు దేవుడు" అను మాటలతో పరిశుద్ధాత్మావేశ లేఖకుడైన మోషే తన వ్రాతల నారంభిస్తూ దేవుని సర్వోన్నతునిగా కనుబరచాడు. తరువాత ఏదెను వనంలో మానవుని జీవితాన్ని వర్ణిస్తూ దానికి కేంద్రంగా దేవుడే యున్నాడని తెలియబరచాడు; ఏలయనగా దేవుని సన్నిధి అక్కడ యుండెను (ఆది 3:8).

కాలము గడుచుసరికి లోకంలో పాపం ప్రవేశించింది. మానవుడు దేవునినుండి వేరై పోయాడు. మానవుడు దుష్టత్వంలో ముదిరే కొలదీ దేవుని నుండి దూరమై పోయాడు. మానవుని దుష్టత్వం ఎంత ఘోరంగా తయారయ్యిందంటే భూమిమీద లేకుండ మానవుని నాశనం చేయాలని దేవుడనుకొన్నాడు. ఆనాటి లోకమంతా దేవుని నుండి దూరమైపోయినను తన జీవితంలో దేవునికి ముఖ్యస్థానాన్నిచ్చిన వాడొకడున్నాడు. "నోవహు యెహోవా దృష్టియందు కృపపొందిన వాడాయెను" (ఆది 6:8).

దేవుని ప్రజలు దేవునినుండి వేరై తమచుట్టు యున్న అన్యజనుల దేవుండ్ల దగ్గరకు తరలిపోయిన ఉదంతములతో పాత నిబంధన నిండి యున్నది.

## దేవుని నుండి వేరైన ప్రజలు

నిర్గమ కాండములో చూస్తే ఇశ్రాయేలీయులు విగ్రహారాధన చేయు ప్రజలకు బానిసలుగా యున్నారు. అయితే దేవుడు జోక్యం చేసుకొని మోషేద్వారా తన ప్రజలను బానిసత్వము నుండి విడిపించాడు (నిర్గమ 3:18). మానవుని మనోభావాలకు కేంద్రంగా దేవుడే యుండాలని కోరుచున్నట్లు ఆయన చూపించాడు. అయినను ఇశ్రాయేలీయులు బానిసత్వము నుండి విడుదల పొందగానే, ఐగుప్తీయుల దేవుండ్లను కాంక్షించుచున్న వారిగా కనబడుచున్నారు. నిర్గమ 32:1, 4 వచనాల్లో ఇట్లు వ్రాయబడి యున్నది : "మోషే కొండ దిగకుండ తడవుచేయుట ప్రజలు చూచినప్పుడు ఆ ప్రజలు అహరోను నొద్దకు కూడివచ్చి - లెమ్ము, మా ముందర నడచుటకు ఒక దేవతను మా కొరకు చేయుము అని చెప్పిరి. అతడు వారియొద్ద వాటిని తీసికొని పోగరుతో రూపమును ఏర్పరచి దానిని పోతపోసిన దూడగా చేసెను. అప్పుడు వారు ఓ ఇశ్రాయేలూ, ఐగుప్తుదేశములో నుండి నిన్ను రప్పించిన నీ దేవుడు ఇదే అనిరి." వారెంత తొందరగా మర్చిపోయారో! కొండమీద మోషేకు ఇయ్యబడిన మొదటి ఆజ్ఞను, "నేను తప్ప వేరే దేవుడు నీకు ఉండకూడదు" అను ఆజ్ఞను వారు మర్చిపోకుంటే ఎంత బావుండునో! (నిర్గమ 20:3).

ఇదంతా ఈనాడు మనకెలా వర్తిస్తుంది యని మీరడుగ వచ్చు. గలతీ 5:19-21 లో పౌలు ఇట్లు హెచ్చరిక చేసాడు : "శరీరకార్యములు స్పష్టమై యున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన...మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను." నేను విగ్రహాలకు మ్రొక్కను, గనుక ఇది నాకెలా వర్తిస్తుంది యని మరల మీరడుగవచ్చు. కొలస్స 3 : 5 లో పౌలు ఇట్లు వ్రాసాడు : "కావున

భూమిమీద నున్న మీ అవయవములను అనగా జారత్వమును, అప విత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి."

## ఆస్తిపరుని విగ్రహం

యేసుప్రభువు ఈ లోకంలో యున్నప్పుడు ఒక యౌవనస్థుడు వచ్చి, "నిత్య జీవము పొందుటకు నేను ఏ మంచి కార్యము చేయవలెనని ఆయనను అడిగెను" (మత్తయి 19:16). నీవు ఆజ్ఞలను గైకొనవలెనని క్రీస్తు అతనితో చెప్పగా ఆజ్ఞలు గైకొనుచున్నానని అతడు జవాబిచ్చాడు. "అందుకు యేసు - నీవు పరిపూర్ణుడగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడింపుమని అతనితో చెప్పెను. అయితే ఆ యౌవనుడు మిగుల ఆస్తిగలవాడు గనుక ఆ మాట విని వ్యసనపడుచు వెళ్ళిపోయెను" (మత్తయి 19:21-22).

ఈ సందర్భాన్నిబట్టి ఒకడు తన ఆస్తినే ఒక విగ్రహంగా ఎట్లు తయారు చేసుకొన్నాడో చూడగలం. ఈ యౌవనుడు దేవునికంటే, తన ఆత్మకంటే, తన ఆస్తినే ఎక్కువ ప్రేమించాడు. అట్టి వారిని గూర్చి హెచ్చరిస్తూ పౌలు ఇట్లు వ్రాసాడు : "ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమో 6:10).

## దేవుని మెప్పు కోరాలి

దేవునికంటే ఘనమైనదిగా దేనిని ఎంచరాదని క్రీస్తు విపులంగా బోధించాడు. "తండ్రినైనను తల్లినైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు; కుమారునినైనను కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు" అని ఆయన హెచ్చరిక చేసాడు (మత్తయి 10:37). దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును కోరిన వారినిగూర్చి యోహాను 12:42,

43 లో మనం చదువగలం: "అయినను అధికారులలో కూడ అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి గాని, సమాజములోనుండి వెలివేయ బడుదుమేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి".

దీని నంతటినుండి మనం గ్రహించవలసింది యేమంటే, దేనికైనా దేవునికంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినయెడల మనం విగ్రహారాధన చేసినట్లగును. ఏలయనగా అది మనకొక విగ్రహమగును. అట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు. అయితే, "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి" యని మన ప్రభువు చెప్పిన హెచ్చరికను జ్ఞాపకముంచుకొందము (మత్త 6:33). మనమట్లు చేసినయెడల విగ్రహారాధన పాపమువలన అపరాధులము కాకుందము. —పాల్ కేంట్రల్.

---

# తలుపు దగ్గర యెవరో యున్నారు
## *(Some one is at the Door)*

"ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను" (ప్రక 3:20).

తలుపుదగ్గర ఎవరో యున్నారు! ఆయన నీకొక వర్తమానము తెచ్చాడు. అది నీ జీవితానికి మరణానికి సంబంధించినది. నీవు అతి క్రియములచేతను పాపములచేతను చచ్చినవాడవా? ఆయన వర్తమానము నీకే. నీవు క్రొత్త జీవితము నారంభించినట్లు నీకొక శుభవార్తను తెచ్చుటకు ఆయన బహు దూరమునుండి ఆయాసకరమైన ప్రయాణం చేసాడు. ఆ ప్రయాణం పరలోకంలో ఆరంభమై పరలోకంలోనే అంతమొందింది, గాని అది కల్వరిగుండా వెళ్ళింది. ఆయన నిజంగా జీవమునుగూర్చి, సమృద్ధియైన జీవమునుగూర్చి ఇప్పుడును, తదనంతరము నిత్యజీవమును గూర్చిన వర్తమానాన్ని తీసికొచ్చాడు.

అయినను ఆయన మరణాన్ని గూర్చి కూడా మాట్లాడుచున్నాడు- అది నీ మరణం! ఆయన ఇట్లనుచున్నాడు: “పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును” (యోహా 11:25). మనుష్యులొక్కమారే మృతి నొందుదురని నియమింపబడినను, ఆయన పాతాళము యొక్కయు మరణము యొక్కయు తాళపుచెవులను కలిగి యున్నాడు (ప్రక 1:18); కడపటి శత్రువగు మరణాన్ని నాశనము చేతునన్నాడు (1 కొరింథీ 15:26).

ఆయన చెప్పుచున్న జీవము ఆయనలో నిలుచుండి నూతన సృష్టియైన జీవం. ఆయనలో యుండుట అంటే ఆయన సంఘంలో యుండుటయే. అది ఆయన శరీరము. నీవు క్రీస్తునందు జీవిస్తే ప్రభువునందు మృతిజెందవచ్చు. ఆయన శక్తినిబట్టి నీవు తిరిగి లేపబడుదువు. నీపై ఆ రెండవ మరణానికి శక్తి యేదీ ఉండదు. కాని నీవు నిరంతరము శాంతిలో నిలుచుందువు. చెప్పుచున్నవాడు, ఆయన వాక్యము సంఘము పరలోకము - ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడివడియున్నవి. నీవు ఏ ఒక్కదాన్ని తిరస్కరించినా మిగతా వాటినన్నీ పోగొట్టుకొంటావు. యిది జీవన్మరణాల సమస్య. ఎవరో తలుపునొద్ద నిలుచున్నారు. వాటినిగూర్చి ఆయన చెప్పు సంగతులను జాగ్రత్తగా ఆలకించుము!!

—H. హెబ్రీ.

---

విశ్వాస వీరులు - 4

## అబ్రాహాము

## *(Abraham)*

“అబ్రాహాము పిలువబడినప్పుడు విశ్వాసమునుబట్టి ఆపిలుపునకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలువెళ్లెను. మరియు ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలువెళ్లెను” (హెబ్రీ 11:8).

ఆదికాండము 12:1 లో అబ్రాహాముకు దేవుడిచ్చిన పిలుపు ఇట్లు రికార్డు చేయబడి యున్నది: "యెహోవా - నీవు లేచి నీ దేశము నుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము" అని చెప్పెను. అబ్రాహాము ఈ యాజ్ఞకు లోబడినందున అతని పేరు విశ్వాసవీరుల పట్టికలో చేర్చబడింది. అతని విశ్వాసాన్ని మనం సరిగా తెలిసికొను నిమిత్తము, ఈ యాజ్ఞకు లోబడుటలో అతనికున్న కష్టాన్ని గమనించుదాం.

మొదటిగా అబ్రాహాము తన దేశాన్ని విడిచిపెట్టాలని ఆజ్ఞాపింపబడింది. అప్పటికి అతడు జీవించుచున్న ఊరను పట్టణం పురాతనకాల ప్రపంచానికొక గొప్ప సాంస్కృతిక కేంద్రం. ఈ సౌందర్య పురం యొక్క సదుపాయాలను, సంతోషాలను, కార్యకలాపాలను అతడు వదలిపెట్టాలి.

రెండవదిగా అబ్రాహాము తన బంధువులను విడిచిపెట్టాలని ఆజ్ఞాపింపబడింది. ఇందులో బంధువులు మిత్రులుకూడా యున్నారు. వీరందరిని విడిచిపెట్టేయాలంటే ఎలాగుంటాది? ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి బదిలీ అయినవారు ఇందులో యున్న కష్టాన్ని తెలిసికోగలుగుతారు. నీ తండ్రి యింటిని విడనాడాలని అబ్రాహాముకు చెప్పబడింది. దగ్గరబంధువులను విడనాడడం ఎంత విచారంతోకూడిన పనోగదా! అది కన్నీళ్ళతో కూడిన ఎడబాటే.

ఈ యాజ్ఞకు లోబడడంలో అత్యంత కష్టం యేమంటే అబ్రాహాము ఎక్కడికి వెళ్లాలో దేవుడతనికి చెప్పలేదు. అతడు ఎక్కడికి వెళ్ళవలెనో, ఎంతదూరం వెళ్ళవలెనో, అక్కడి కెళ్ళడానికి ఎన్ని రోజులు పట్టునో ఏమియు ఎరుగకయే అబ్రాహాము బయలు వెళ్లాడు.

అతడెందుకు వెళ్లాడు? అనే మంచి ప్రశ్నను ఇక్కడ మనం అడుగవచ్చు. అబ్రాహాము దేవుని కెందుకు విధేయుడయ్యాడు?

బైబిలులో రెండు కారణాలు ఇయ్యబడ్డాయి. "అబ్రాహాము దేవుని నమ్మెను" అని రోమా 4:3 చెప్పుచున్నది. ఎంత సూక్ష్మమైన వివరణ! దేవునియందు అతనికి నమ్మకం యున్నది గనుక అబ్రాహాము దేవునికి లోబడ్డాడు. ఎందుకు అనే సంగతి అతనికనవసరం. దేవుని మాటే అతనికి చాలు.

అతడు విధేయుడగుటకు రెండో కారణం యేమంటే, "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడునై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణముకొరకు అబ్రాహాము ఎదురు చూచుచుండెను" (హెబ్రీ 11:10). భౌతికంగా జీవించడం కంటే జీవితం యొక్క భావం ఇంకా వుందని అబ్రాహాముకు తెలుసు. ఈ జీవితానంతరం బహుమానం పొందాలంటే భూమిమీద ఉండగానే దేవునికి లోబడాలని అతడెరుగును.

అబ్రాహాముకున్న విశ్వాసం నుండి మనం ఏమి నేర్చుకోవచ్చును?

1. ఒక నూతన జీవితం ఆరంభించుటకు దేవుడు క్రీస్తుద్వారా మనలను పిలుచుచున్నాడు.

2. తరుచు, ఈ క్రొత్త జీవితం ఆరంభించడానికి మనం మన బంధువుల నుండి, మిత్రుల నుండి, చివరకు మన కుటుంబము నుండి కూడా విడిపోవలసి వస్తాది.

3. దేవుడు చెప్పాడు కాబట్టి ఏమియు ప్రశ్నించకుండగానే ఆయన వాక్యానికి మనం లోబడుటకు ఇష్టపడాలి.

4. అబ్రాహాము చేసిన దాన్నిబట్టి అతని విశ్వాసము ఎంచబడింది. అదే విధముగా మనం ఆయన వాక్యానికి ఎట్లు లోబడుచున్నామో దాన్నిబట్టి దేవుడు మన విశ్వాసాన్ని ఎంచుతాడు.

—డేవిడ్ జాన్సన్.

# నీళ్లులేని బావులు - వర్షింపలేని మేఘాలు
(2 పేతురు 2 : 17).

ఎడారులలోని ఒయాసిస్సులను చూడగనే బిడారుల కెంతో ఆనందం. వేసవిలో పయనించి, దప్పిగొనిన బాటసారి బావిని చూచి నంతనే దాహము తీరునని ఆనందించును. ఎండమావులను చూచి, నీళ్ళని భ్రమించి, లేళ్లు, దుప్పులు పరుగులిడును. కారు మేఘములను చూడగనే వ్యవసాయదారునికి అమితానందం.

ఒయాసిస్సు : నిరంతరము నీళ్ళతో యుండును ఎడారు లలో పయనించి వచ్చిన బిడారులకు దాహము తీర్చును.

నీళ్లులేని బావి : లోతైనది. తేమగల్గి యుండును. అందు కప్పలు నివసించి శబ్దము చేయును. అరగజములోతు త్రవ్వినచో మంచి జలపుట్టును. అబద్ధబోధకులు సత్యవేదం అరగంటైనను దృష్టి యుంచి చదువరు. సత్యం గ్రహించరు. వీరు మనుష్య కల్పిత సిద్ధాం తములను, పారంపర్యాచారములను, ఆజ్ఞలను అనుసరించి, చేత పట్టు కొని, రుచిచూచి, (కొలస్స 2:22) తప్పుడు బోధలు బోధిస్తారు. వీరు నీళ్లులేని బావులవంటివారు.

వర్షింపలేని మేఘములు : చాల దట్టముగా యుండును. నీటితో నిండియున్నట్లు, నిగనిగలాడుచు, ఉరుములు, మెరుపులతో ఫె ఫెళమని శబ్దము చేయుచుండును. ఇంతలో గాలి వీచగా అంతటి కారుమేఘము వర్షింపకుండా చెదరగొట్టబడును. అబద్ధ బోధకులు ఇట్టి వారే. వీరియొద్ద గ్రంథముండును. వాక్యము దేవునిమాట; అది సత్య మని నమ్మరు. మనుష్యులు చెప్పిన సంగతులకు ప్రాధాన్యమిత్తురు. విశ్వాసముంటే చాలు. ఉపవాసముండి, కన్నీరు కార్చి ప్రార్థించ మంటారు. బాప్తిస్మము పొంది, రక్షణలో యుండమని బోధించరు. ఇట్టివారు వర్షింపని మేఘములవంటివారు. వీరు ఎటు లాభం ప్రాప్తిస్తే అటు గాలికి మేఘంవలె చెదరిపోవుదురు.

జలరాశుండ మూయబడిన మట్టి చెత్త చెదారం లాంటి పారంపర్యాచారములు, మత సిద్ధాంతములు, మనుష్యకల్పిత పద్ధతులవంటి వాటిని తొలగించిననాడు, స్వచ్ఛమైన జల ఊబికి, పొంగి పారును. అట్టి నీళ్లుగల బావిగాను, వర్షించునట్టి మేఘములుగాను మనము ఉండవలయునని దేవుడు కోరుచున్నాడు. అట్లు కానిచో నీ బ్రతుకు ఎండమావులవంటిదే. నీళ్ళని భ్రమించి అటు ఇటు తిరుగులాడు లేళ్లు దుప్పులవలె యుండును. అట్లుగాక నిరంతరము నీళ్ళుగల్గి యుండు ఒయాసిస్సులవలె బైబిలు చెప్పినదే చేసి జీవించి జీవజలములను త్రాగి, ఇతరుల ఆత్మీయ దాహమును తీర్చువారముగా యుండుటకు ప్రయత్నింతుము గాక.

—ఎ. ఇశ్రాయేలురాజు, కాకినాడ.

---

## తప్పిపోయిన కుమారుడు

(లూకా 15)

తప్పిపోయిన కుమారుడు అని మనము సాధారణముగా చెప్పుకొను ఉపమానము నుండి ప్రభువు మనకు నేర్పు పాఠములను ఒకసారి చూద్దాం.

1. దేవుని చిత్తమును నిరాకరించి స్వంత చిత్తమును నెరవేర్చుకొన యత్నించుటతో పాపము ప్రారంభమగును. ప్రభువు మనలనెందుకు పాప బంధకముల నుండి విడుదల జేసెను? ఆయనకు నిత్యము దాసులుగ నుండుటకే. నిజమైన స్వాతంత్ర్య మేది? ప్రభువునకు దాసులుగ మనలను మన మప్పగించుకొనుటయే (రోమా 6:19).

2. వాడు దూరదేశమునకు పోయెను. వాడెంత దూరము పోయెను! ప్రతి పాపము దూరముగా అతని కొనిపోయెనని మనము చెప్పవచ్చును. ప్రార్థన మానితివా, దేవునికి కొంత దూరమైతివి; వాక్యపఠన మానితివా! యింకను దూరమైతివి. ఆరాధన క్రైస్తవ

సహవాసము, ప్రభువున కిచ్చుట, వీనిని వదలితివా మరింత దూర మైతివి. ఇక్కడ మరొక సంగతి మనము చూడగలము. ఒకడు దేవుని విడిచి పాపమువైపు ఒక్క అడుగు వేసినచో రెండవ అడుగు, మరొక అడుగు వేయుచునే పోవును. అతడు బుద్ధి తెచ్చుకొని వెనుకైనా రావచ్చును, లేదా ముందుకైనా పోవలయును. కాని కొంతదూరము పోయి అక్కడ నిలువలేడు.

3. పందులను మేపుటకు పొలములోనికి పోయెను. అతడు పాపములో ఎంత హీనస్థితికి దిగజారెనో తెలుపుటకు ప్రభువు పందులు అను పదము వాడెను. యూదులకు ఈ జంతువు బహు అసహ్యకర మైనది. దుఃఖ మతని అన్నివైపుల ఆవరించినది. ఒక భక్తుడిట్లు పలికి నాడు. "నిన్న నేడు, నిరంతరము, దుఃఖము యొక్క తల్లి పాపమే". మరొకరిట్లు చెప్పిరి. "పాపమునకు జీత మెల్లప్పుడు చెల్లింప బడును. ఆలస్యమైనచో వడ్డీతో చెల్లింపబడును". ఈ సత్యమునుగూర్చి బైబిలు చరిత్రలో మనకెన్నో ఉదాహరణలు గలవు.

4. "అయితే" అతనికి బుద్ధి వచ్చినపుడు, ఈ మాట చెప్పి నపుడు ప్రభువు గొప్ప నిట్టూర్పు విడిచి యుండును. అయితే—అను ఈ పదము ఈ చరిత్రను సంబంధములేని 2 భాగములుగ తుంచి వేసెను. ఈ యువకుడు నిన్నటివరకు దుష్టుడు. అయితే - నేడు సన్మార్గుడుగా మారినాడు. ఈమె నిన్నటివరకు జగడగొండి అయితే నేడు సాత్వికము గలదాయెను. ఈలాటి మాటలు ఎవని గూర్చి విందుమో వారు ధన్యులు. పాపము నెవడైనా చేయును, బుద్ధిహీనుడు మాత్రము దాని కంటియుండును. బుద్ధి వచ్చినపుడు అను మాటల భావమేమి? తానెవడో తాను తెలిసుకున్నాడు (He came to himself). జ్ఞాని ఎవరు? అనుదానికి హిందూ వేదాంతము చెప్పి జవాబేమన - నీవు యోచించగా యోచించగా నీవు పరబ్రహ్మవని తెలిసికొనుటయే జ్ఞానము. నీవు నరుడవుకావు, పాపివి అసలేకావు, నీవు

పరబ్రహ్మవే. ఇదియే పరమజ్ఞానము. కాని బైబిలేమి చెప్పుచున్నది? నీ వెవరవో సరిగ్గా యోచించినచో నీవు బుద్ధిహీనుడవని తెలిసికొందువు. ఈ చిన్నకుమారుడీ సత్యమును గ్రహించెను. ఈ కథలో చిన్నకుమారుడు మనకు నేర్పు పాఠ మిదియే.

5. నా తండ్రి యొద్దకు వెళ్లెదను: ఇతడేమి పోగొట్టు కొన్నాడు? ఆస్తి, ఆరోగ్యము, పసువు, స్నేహితులను, బంధువులను సమస్తమును పోగొట్టుకొన్నాడు. కాని ఒక్కటి మాత్రము పోగొట్టు కొనలేదు. అదేది? "నా తండ్రి" అను అండలేక ఆశ్రయము ... ఓ పాపీ నీవు నీ పాపమువలన సమస్తమును పోగొట్టు కొందువు. కాని నిన్ను ప్రేమించు పరమ తండ్రిని పోగొట్టుకొనలేవు. నీ పాపము ఆయన సహవాసమునకు నిన్ను దూరము చేయవచ్చు, గాని ఆయన ప్రేమకు దూరము చేయలేదు. దేవుని ప్రేమనుండి మనల నెడబాపు చేయునది ఏదియును లేదు.

రక్షింపబడిన ప్రతిపాపి నా దేవుడు తనతో బంధించు కొనును అని చెప్పెను. ఆ బంధము పేరు "సంబంధము" - అనగా ఏమి? నేను తండ్రిని, నీవు నాకుమారుడవు. అదియే వారిరువురిని బంధించిన త్రాడు.

మరియు రక్షింపబడిన పాపి మరొక త్రాటితో తన్ను దేవునితో బంధించుకొనును. ఆ బంధము పేరు "సహవాసము" - ఈబంధముద్వార అతడు దిన దినము ప్రభువుతో సహవాసము చేయగలుగును. ఎప్పుడైనా మన బుద్ధిహీనతచే "సహవాసము" అను త్రాడు తెంపివేతుము. ప్రభువుకు మనకు సహవాసము చెడిపోవును గాని "సంబంధము" అను త్రాడు మాత్రము ఎన్నడును తెగిపోదు. నీవు మరల ఎంత పాపములో పడినను, దేవుడు నీతండ్రియే, నీవు ఆయన కుమారుడవే.

6. నేను లేచి...ఇది ఒక గట్టి తీర్మానము. తండ్రి ... అను మాట అతనిలో ధైర్యము పుట్టించినది. నిరీక్షణను కలుగజేసినది. ఓ

పాపీ నిరాశ చెందకుము. క్రైస్తవుని జీవితములో నిరాశ అను పదమునకు చోటులేదు. మరియు తండ్రి ఉన్నాడు అనుకొన్నంతలో ప్రయోజనములేదు. లెమ్ము, తిరుగుము. ఆయన తట్టు పయనించుము. తీర్మానములో మారుమనస్సున్నది. హృదయ పరివర్తనతో కూడినదే నిజమైన మారుమనస్సు. ఈలాటి మారుమనస్సు పరలోకమును కదలించి, దూత సమూహములు దేవుని సన్నిధిని గంతులు వేయునట్లు చేయును, మరియు సర్వశక్తుడగు దేవుడు తన ఆసనము నుండి లేచి నిర్భాగ్యుడగు పాపివైపు పరుగెత్తి అతని కౌగలించునట్లు చేయును. మారుమనస్సు కలిగించిన అద్భుతములు బైబిలు చరిత్రలో అనేకములు గలవు (యోనా ౩).

7. "పాపము చేసితిని" - చేసిన పాపము ఎంత ఘోరమైనదో దానిని ఎట్లు ఒప్పుకొనవలెనో ఈ చిన్నకుమారుడు మనకు తెలియజేయుచున్నాడు. అతని పాపము మూడువైపుల దెబ్బతీసినది. మొదటి దెబ్బ దేవునిపై బడినది (పరలోకమునకు విరోధముగా); రెండవ దెబ్బ తండ్రిమీద పడినది (నీకును విరోధముగా); మూడవ దెబ్బ తనపైనే బడ్డది. (కుమారుడ ననిపించుకొనుటకు యోగ్యుడను కాను). అతని అయోగ్యత అతనికి బాహాటముగ కాన్పించుచున్నది. చేసిన పాపమొక్కటియైనను, అది చిన్నది అయినను పెద్దది అయినను మూడువైపుల దెబ్బతీయును. మనముచేయు ప్రతిపాపము మొట్ట మొదటిగా పరలోకమందున్న దేవుని కొట్టును. మరియు ఒకడు చేసిన పాపమునకు శిక్ష బయటనుండి రాకపూర్వమే అతడు తన్ను తానే శిక్షించుకొనును. దీనిని బట్టి పాప మెంత భయంకరమైనదో మనకు గోచరమగుచున్నది.

8. వాడింక దూరముగా నుండగా—తండ్రి చూచి, కనికరపడి, పరుగెత్తి, మెడమీద పడి, ముద్దు పెట్టుకొనెను. కుమారుడు, తండ్రి యింటివైపు వేసే ప్రతి ఒక్క అడుగునకు తండ్రి అతనివైపు

క అడుగులు వేయుచున్నాడని భావించ వచ్చును. మరొక రీతిని చెప్ప వలెనన్న తండ్రిని కలుసుకొనుటకు కుమారునికి గల ఆతురతకన్న తండ్రికే ఎక్కువ ఆతురత ఉన్నట్టు మనము గ్రహించవలయును.

9. నన్ను నీ కూలివాండ్లలో ఒకనిగా పెట్టుకొనుము. కుమారుడు ఒప్పుకొన్న పాపము, అభ్యర్థన తండ్రి వినిపించుకొన్నట్టు కాన్పించదు. సరే నేను క్షమించితిని. ఇక మీదట జాగ్రత్తగ నుండుము అని కూడ చెప్పలేదు. తాను చెప్పవలసినదంతయు గాఢాలింగనము తోను, ముద్దుతోను తెలియజేసెను. కుమారుడడిగిన దానికిని, తండ్రి యిచ్చిన దానికిని పోలిక లేదు. మనము అడుగు వాటన్నిటి కంటెను ఊహించు వాటన్నిటి కంటెను విస్తారముగ చేయగల దేవుడు మన కున్నాడు. ఆయనకు స్తోత్రము (ఎఫెసీ 3:21).

10. తిరిగి వచ్చిన కుమారునికి దొరికిన దేమి?

1. ప్రశస్త వస్త్రము : ఈ వస్త్రముతో అతని రూపమే మారిపోయినది. అతని దరిద్రస్థితిలో చూచిన వాడెవ్వడు అతని గుర్తు పట్టలేనంతగ మార్పు అతనికి కలిగినది. ఓ పాపీ నీవు మారుమనస్సు నొందినచో నీతి వస్త్రము, రక్షణ వస్త్రము, గొర్రెపిల్ల రక్తములో ఉదుకుకొన్న తెల్లని వస్త్రము నీకు లభించును. నీవును నేనును పర లోకమునకు వెళ్ళి ఆయన సింహాసనము యెదుట నిలుచున్నపుడు తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తుతో - "ఎన్నడు పాపము చేయనివారిని నా సింహాసనము యొక్క కుడివైపున నిలువబెట్టుమని" అడుగునసుకొందాము. క్రీస్తేమి చేయును? నిన్నును నన్ను నిలువ బెట్టును. అది నిజమా? అట్లు జరుగునా? మనము పాపము ఎన్నడు చేయలేదా? చేసితిమి. నీతిమంతులుగా తీర్చబడితిమి అను వాక్య భావ మేమన ఒకడు క్రీస్తునందున్నప్పుడు వాడు ఎన్నడు పాపము చేయనివాని స్థానములో నున్నాడనుట యే.

2. ఉంగరము తొడిగిరి - ఉంగరము అధికారమునకు సూచన. పత్రములపైని, వారు పంపు తాకీదులపైని ఉంగరముతో ముద్ర వేయుదురు (ఎస్తేరు 8:12). సోదరా, అధికారమును సూచించు ఉంగరము క్షమాపణ పొందిన ప్రతి క్రైస్తవునికి గలదు. నీవు క్రీస్తు పక్షమున ఏమి చెప్పినను అది అధికార వాక్కే. మరి ఎవనివలనను రక్షణ కలుగదు, నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షించబడును. ఈలాటి వాక్కులు ప్రభువు పక్షమున నీవేమి చెప్పినను అధికార వాక్కులే (అపొ.కా. 4:12; మార్కు 16:16).

3. పాదములకు చెప్పులు తొడుగుడి. తూర్పు దేశస్థులు తాం మింటిలోనుండి బయటకు పోవునపుడు చెప్పులు తొడుగుకొందురు. అనగా వెలుపట అతడు చేయవలసిన పని యున్నది. ప్రభువెందులకు మనకు నీతివస్త్రము తొడిగెను? అధికారమును సూచించు ఉంగర మెందులకిచ్చెను? పాదములకు సమాధాన సువార్తకొరకైన సిద్ధమనస్సు అను జోడు ఎందులకిచ్చెను? ఆయనను సేవించుటకే.

— T. జ్ఞానానందము, కాకినాడ-2.

---

## పేతురు పోపా?

### ( *Was Peter Pope ?* )

పేతురు పోప్ అయినట్లు బైబిలు ఎక్కడా చెప్పడం లేదు. పోప్, పాపసీ అనే పదాలు బైబిలులో ఎక్కడా కన్పించవు. ఈపదవిని గూర్చిన భావాలు మొదటి శతాబ్దం తరువాత ఎప్పుడో ఆరంభమైనవి. గనుక బైబిలులో వర్ణించబడిన క్రీస్తు సంఘంలో ఈ స్థానం కలిగిన వాడెవడు లేడు.

పేతురు ఒక అపొస్తలుడు (మత్తయి 10:2), సువార్తికుడు (అపొ.కా. 2:14). మిగిలిన అపొస్తలులపై అధికారివలె ఎన్నడు అతడు ప్రవర్తించలేదు, అట్లని చెప్పుకోలేదు.

నేడు పోపులకున్న 'అర్హతలను' బట్టి చూస్తే పేతురు పోప్ కాదు. అతడు వివాహితుడు (మత్తయి 8:14). అతడు అపరాధిగా తీర్చబడెను గనుక పౌలు అతనిని గద్దించాడు (గలతీ 2:11). గనుక అతడు పొరబడని మనిషి కాదని ఇది నిరూపించుచున్నది. అతన్ని ఆరాధించడానికి ప్రజలతని పాదములపై పడినప్పుడు, "లేచి నిలువుము, నేనుకూడ నరుడనే" యని అతడు ప్రకటించాడు (అపొ.కా. 10:26).

యేసుక్రీస్తు తన సంఘానికి పునాదియై యున్నాడు (1 కొరింథీ 3:11). యేసు తన సంఘానికి శిరస్సయి యున్నాడు (కొలస్స 1:18). సాధారణంగా ఏ సంస్థ కూడ రెండు శిరస్సులను కలిగియుండదు. సంఘానికి క్రీస్తు ఒక్కడే శిరస్సు. ఏ మానవుడు కాదు.

దైవావేశమువలన కలిగిన లేఖనములు మనలను ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు చేస్తాయి (2 తిమో 3:16, 17). పోప్ అనే పదవి, ఆ యధికారము బైబిలులో లేనందున దాన్ని ఆరంభించినది యెవరు - దేవుడా? మానవుడా?

---

## ఎవరు ఏకమైయుండవలెనని క్రీస్తు ప్రార్థించెను?

"నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహా 17:20-21).

క్రీస్తుచేసిన ప్రార్థనలోగల ఈ వాక్యమందు ఎవరెవరు కనబడుచున్నారు?

1. తండ్రి=తండ్రియైన దేవుడు.
2. నేనును=యేసుక్రీస్తు ప్రభువు.
3. వారును=అపొస్తలులు.
4. వారందరును=విశ్వాసులు లేక క్రైస్తవులు.

ఈ గొప్ప ప్రార్థన ఫలితముగా క్రీస్తును నమ్మినవారందరు ఏకమై యుండగలరు. బోధ, సంఘనామము, సంఘ పాలన, సంఘ పరిచారకుల పేర్లు ఆరాధనక్రమము సంఘ సభ్యత్వము సంఘ సిద్ధాంతము మొదలగు వాటన్నిటిలో ఏ కాలమైనా, ఏ దేశమైనా ఏకత్వము కలిగి ఒక్క విశ్వాసము ఒక్క శరీరము ఒక్క బాప్తిస్మము ఒక్కటే నిరీక్షణ కలిగి ఉండగలరు. ఏలయనగా అట్లు కావలెనని క్రీస్తు ప్రార్థించెను గనుక ఇక మార్పు లేదు, మార్పు రాదు.

అయితే మనకళ్ళకు కనబడే పొత్తు కుదరని సంఘాలు, గుంపులు, మిషనులమాటేమిటి? అవి విశ్వాసములో, బోధలో, సంఘ నామములో, సంఘ ఆరాధనలో సిద్ధాంతములో ఒక దానితో ఒకటి పొసగక, బాప్తిస్మము, విశ్వాసము నిరీక్షణ, మొదలగు వాటిలో ఏ మాత్రము ఏకత్వము లేకయే వీరంతా క్రీస్తునందు విశ్వాసముగల వారమనుచున్నారు. మరి వీరెవరు? వీరిపట్ల క్రీస్తు ప్రార్థన నిష్ఫలమాయెనా? అట్లనరాదు.

క్రీస్తు ప్రార్థనలోగల మాటలను గమనించినయెడల మనము పొరబడక యుందుము. "వారి వాక్యమువలన" అనగా అపొస్తలులు బోధించు వాక్యమువలన "నాయందు విశ్వాసముంచిన వారందరు ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను".

క్రీస్తునందు మాకు విశ్వాసమున్నది అనగానే సరిపోదు గాని అపొస్తలుల వాక్యముద్వారా కలిగే విశ్వాసమై యుండాలి. అపుడు సంఘస్థాపన నాటినుండి వారు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి (అ. కా. 2:42). "మా సువార్తవలన మిమ్ములను పిలచెను"

"మేము మీకు ప్రకటించిన సువార్త" "మావలన పొందిన బోధన ప్రకారము" "మా నోటి మాటలవలననైనను, మా పత్రికలవలననైనను మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి" (2 థెస్స 2:14; గల 1:8; 2 థెస్స 3:6, 2:15). "మన ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి" (యూదా :17-18).

నిజమునకు అపొస్తలులు శరీరమందు మన మధ్య నివసించుట లేదుగాని వారు తమ గుడారములను విడువకముందే పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన వాక్యమును మనము నిత్యము జ్ఞాపకము చేసికొనులాగున వారు భద్రముచేసిరి (1 పేతు 1:13-21).

అదియే క్రొత్త నిబంధన గ్రంథము. పరిశుద్ధ లేఖనము అని పిలవబడుచున్నది. ఇట్టి క్రొత్తనిబంధనను అనుసరించువారు అపొస్తలుల వాక్యమువలన క్రీస్తునందు విశ్వాసముంచు వారగుచున్నారు. గనుక వీరియందు క్రీస్తు ప్రార్థనాఫలము క్రియారూపము ధరించి ఏకమై యుండుటకు సాధ్యమగుచున్నది.

అయితే కొందరు "తమ బోధచేత" "క్రీస్తు సువార్తను చెరప గోరి" అపొస్తలుల "వలన పొందిన బోధన ప్రకారము కాక" "మనుష్యులు కల్పించిన పద్ధతులను దైవోపదేశములని బోధించుచూ" (అ. కా. 15:24; గల 1:7; మత్త 15:7-9). ఈ రీతిగా అపొస్తలుల వాక్యమువలన కొంతయూ, పా॥ ని॥ గ్రంథమందలి వారికి నచ్చినవి కొన్నియూ, వారివారికి దర్శనములద్వారా బైలుపర్చబడినవి అని చెప్పుకొనేవి మరికొన్నియు కలిపి వారు క్రీస్తునందు విశ్వాసముంచు చున్నారు. నిజమున కిట్టివారు ఏకమై యుండవలెనని క్రీస్తు ప్రార్థించ

లేదు గనుక వీరు ఒకే కాలములో, ఒకే దేశములో, ఒకే పట్టణములో ఒకే వేదికపై నిలిచిననూ ఒకరి సిద్ధాంతముతో ఒకరు, ఒక సంఘ నామముతో మరొక నామము, ఒకరి విశ్వాసముతో మరొకరి విశ్వాసము, ఒకరి బాప్తిస్మముతో మరొకరి బాప్తిస్మము మొదలగు అనేక విషయాల్లో పొసగని పోటీపని చేసుకొంటూ, తమ సంఘాలకు తమ బోధనే చేసుకొంటూ, తమ పేరుకొరకు తాము పాటు పడుచున్నారు. గాని "పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త" "క్రీస్తు సంఘము లన్నియూ మీకు వందనములు చెప్పుచున్నవి".

— పాల్ గూటం, గొల్లవిల్లి.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

**To**

..............................

..............................

..............................

..............................